క్లుప్తంగా

ఎంఈఓ-1గా నరసింహారావు బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలానికి ఎంఈఓ-1గా పీవీ నరసింహారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. జి.కొండూరు ఎంఈఓ-1గా ఉన్న ఈయనకు రెడ్డిగూడెం మండలం పూర్తి అదనపు బాధ్యతలు అప్పచెబుతూ కాకినాడ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్టీయూ నాయకులు జి.అనుగ్రహప్రసాద్, అనిల్‌కుమార్, అబీబుల్లా, ప్రేమ్, శ్రీనివాసరావు, పిచ్చియ్య, శేఖర్‌రెడ్డి, చంద్రయ్య, రవి తదితరులు అభినందించారు.

మచిలీపట్నం బస్సు పునరుద్ధరించాలి



తిరువూరు: మచిలీపట్నానికి దీర్ఘకాలంగా నడుపుతున్న ఆర్టీసీ బస్సుసర్వీసును రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ బస్సును పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు తిరువూరు డిపో మేనేజరు వేణుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా కోర్టుకు, నూజివీడు సబ్ కోర్టుకు వెళ్లే ప్రయాణికులకు ఆ బస్సు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆ సర్వీసు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం



జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును శనివారం నిర్వహించారు. విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనత ఉన్న బాలికలకు మందులను అందజేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

కొండపల్లి పట్టణ అధ్యక్షుడికి సత్కారం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య దంపతులను వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నాయకులు సత్కరించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో ఇటీవల వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా శరభయ్య బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, దయాసాగర్, వెంకయ్యనాయుడు, నాయకులు ఐవోసీ ఆనంద్, రామాలయ ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు ఎంపిక

మైలవరం: వివేకానంద హైస్కూల్‌కు చెందిన నలుగురు ట్రిపుల్ ఐటీలో అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పీ రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివేకానంద పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఎం.కుసుమప్రియ, ఏ రాజరాజేశ్వరి, వై. భవ్యసాయి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో అర్హత సాధించగా, ఎల్‌జే. ధర్మా నాయక్ శ్రీకాకుళంలో సీటు సాధించాడని తెలిపారు.

రూ.14 కోట్లతో సంక్షేమ పథకాలు అందించాం

ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ రూ. 14కోట్లతో సంక్షేమ పథకాలు అందించామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణారావుపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణారావుపాలెం సచివాలయం పరిధిలోని కేశ్యతండా, గ్యామా తండా, దీప్లానగర్, కృష్ణారావుపాలెం ఒక్క గ్రామంలో 620 కుటుంబాలకు నాలుగుకోట్ల 70 లక్షల రూపాయలతో పలు రకాల సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 100శాతం అమలు చేశారన్నారు. ఈ తండాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలలో డయాలసిస్ కేంద్రం కూడా ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. సింటెక్స్ ట్యాంకుల ద్వారా కృష్ణ జలాలు సరఫరా చేయిస్తున్నామని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం లేని గ్రామాల్లో పైపులైన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ గ్రామంలో నివాసముండే అన్ని కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగమల్లేశ్వరి, జమలమ్మ, ఎంపీపీ నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు, నాయకులు వెంకటరెడ్డి, సాంబయ్య, వెంకట్రావు, వెంకటేశ్వరరెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.



కృష్ణారావుపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం, నరుకుళ్లపాడు గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుపతిరావు, ఓబులాపురం, రంగాపురం సర్పంచులు అప్పిరెడ్డి, పి.సునీల పాల్గొన్నారు.

1,199 సర్టిఫికెట్ల పంపిణీ

పెనుగొలను/వినగడప(గంపలగూడెం): గంపలగూడెం మండలంలో శనివారం రెండు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపుల్లో 1,199 సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. పెనుగొలను-2 సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, రాజవరం సర్పంచ్ నరసింహారావులు 572 సర్టిఫికెట్లను పంపిణీ ప్రారంభించారు. ఎంపీడీఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు. వినగడపలో నిర్వహించిన కార్యక్రమంలో 623 ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

సచివాలయ సేవలు సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: ప్రజలకు సత్వర సేవలందించడానికే ప్రభుత్వం వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసిందని తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక 10, 11 వార్డులలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి దరఖాస్తు చేసినవారికి వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్ తంగిరాల వెంకటరెడ్డి, కే సుందరకుమార్ ధ్రువపత్రాలను అందజేశారు.

ఏ.కొండూరులో..

ఏ.కొండూరు: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరుగొలనుపేటలో..

చాట్రాయి: మండలంలోని ఆరుగొలనుపేటలో శనివారం జగనన్న సురక్ష శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. 254 మందికి ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున పాల్గొన్నారు.

మునుకుళ్ల, జీకొత్తూరులో..

తిరువూరురూరల్: మండలంలోని మునుకుళ్ల, జీకొత్తూరు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. రెండు గ్రామాల్లో 1,673 మంది అర్జీదారులకు పలు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. మునుకుళ్ల సచివాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, జీకొత్తూరులో తహసీల్దారు సురేష్‌బాబు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక షాదీఖానాలో విస్సన్నపేట సచివాలయం-1, సచివాలయం-3కు సంబంధించి ఆ కార్యాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: దశాబ్దాలుగా పరిష్కారం కానీ సమస్యలకు సైతం జగనన్న సురక్ష కార్యక్రమంతో అధికారులు పరిష్కారం చూపగలుగుతున్నారని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ పేర్కొన్నారు. మండలంలోని హెచ్ ముత్యాలంపాడు, జి.కొండూరు సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సచివాలయాల మండల కన్వీనర్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ రోహిణీదేవి, ఏంఈఓ వెంకటనర్సింహారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి గ్రామానికి చెందిన గంటా శ్యామ్‌ప్రతాప్(38) ఇటీవల మృతి చెందాడు. మృతుడు శ్యామ్‌ప్రతాప్‌కు భార్య, ఒక పాప ఉన్నారు. ఆ చిన్నారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముచ్చనపల్లి గ్రామానికి చెందిన మంచి సమురుయుని వెల్ఫేర్ అసోసియేషన్ గ్రూపు ప్రధాన మంత్రి సుకన్య సమృద్ధియోజన పథకం కింద రూ.1.50లక్షలు, తల్లి, చిన్నారికి రూ. 50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు సమురుయుని అసోసియేషన్ అధ్యక్షుడు కోడపాటి ఉదయభాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోషియేషన్‌లో 200 మంది సభ్యులు ఏర్పడి ఆపదలో ఉన్న వారికి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే శ్యామ్ ప్రతాప్ కుటుంబానికి రూ. 2 లక్షలు సాయం చేసినట్లు తెలిపారు.

అనాథ బాలలకు అన్నదానం

తిరువూరు: తిరువూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భగవాన్ రమణమహర్షి ఆశ్రమంలోని అనాథ బాలలు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం భార్య ఇందిరారాణి, కుమారుడు నాగప్రసాదరావు జ్ఞాపకార్థం ఈ అన్నదానం చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. క్లబ్ సభ్యులు జనార్దనరావు, ప్రకాశరావు, వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

చాట్రాయి: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ లంకా నిర్మల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి సోమ, గురు, శనివారాల్లో తమ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డితో చర్చించి వాటిని పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముసునూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన కొర్లగుంట గుర్రాలమ్మ, గుర్రాలయ్య ఆలయ ప్రాంగణం సమీపంలో జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 796 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ ఆర్.కృష్ణ కుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐదో డివిజన్‌లో నివాసం ఉంటున్న నక్కా సాంబశివరావు(53) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ సచివాలయం సిబ్బంది ద్వారా వైఎస్సార్ బీమా రూ.లక్ష ఆన్‌లైన్ అయినట్లు గుర్తించారు. తక్షణమే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా తక్షణ సాయంగా రూ.10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన రూ.90 వేలను మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేసిన పిదప మృతుడి కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్‌కు జమచేస్తారని తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పగట పూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. నూతన కనెక్షన్ల కోసం అర్జీ పెట్టిన వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, వ్యవసాయ అధికారి శైలజ, ఏడీఈ వై.కొండలరావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు వితరణ

తిరువూరు: మార్క్‌ఫెడ్ చైర్మన్ కంచి రామారావు జయంతి కార్యక్రమాన్ని శనివారం తిరువూరులో నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన సభలో కంచి రామారావు విద్యాభివృద్ధికి చేసిన కృషిని కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ చైర్మన్ గజ్జల సీతారామారావు వివరించారు. కంచి రామారావు చిత్రపటానికి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంచి రామారావు కుమారుడు రఘుప్రవీణ్, కుమార్తెలు మాధురి, రేఖాస్వప్న కళాశాలకు 10 సీలింగ్ ఫ్యాన్లు, అల్మరాలు వితరణ ఇచ్చారు. ఫ్యాక్టరీ సెంటర్లోని కనకం రెసిడెన్సీ ఆవరణలో జరిగిన రామారావు జయంతి కార్యక్రమంలో పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

బహుజనులను చైతన్యవంతులను చేయడమే లక్ష్యం

మైలవరం: నియోజకవర్గంలో బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారిని చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయవాది జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు. మైలవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గం నుంచి తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిని పోటీలో నిలబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో పుస్తకనిధి ఏర్పాటు

గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే పలు పుస్తకాలతో ఏర్పాటు చేసిన బుక్‌బ్యాంకును శనివారం ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయిరాం ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నీతికథలు, జాతీయ నాయకుల గాథలను తెలియజేసేందుకు ఈ బుక్ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రాజేంద్రప్రసాద్, రాము పాల్గొన్నారు.

పాజిటివ్ దృక్పథంతో ఒత్తిడిని జయించవచ్చు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృత్తిపరంగా జర్నలిస్టులు నిత్యం ఎదుర్కొనే ఒత్తిడిని పాజిటివ్ దృక్పథం అలవర్చుకుని జయించవచ్చని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (రిటైర్డ్) వైస్ చాన్సలర్, సైకాలజిస్ట్ డి.జమున పేర్కొన్నారు. సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమం జరిగింది. జమున మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న పోటీతత్వంతో జర్నలిస్టులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. దీన్ని అదుపులో ఉంచుకోడానికి పాజిటివ్ దృక్పథంతో పాటుగా నిత్యం శారీరక వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని చేయడం వల్ల ఒత్తిడిని కొంత వరకు జయించవచ్చునని తెలిపారు. జర్నలిస్టుల్లోనే కాకుండా ప్రతి ఒక్కరిలో ఒత్తిడి ఉంటుందని, గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో కుటుంబంలోని సభ్యులతో మాట్లాడి బాధను తగ్గించుకునే ప్రయత్నం చేసేవారన్నారు. ప్రస్తుతం మనస్సులోని బాధను ఎదుటి వ్యక్తితో పంచుకునే పరిస్థితులు లేవన్నారు. మనస్సులోని బాధను బయటకు చెప్పడంతో చాలా వరకు ఒత్తిడి తగ్గుతుందని జమున చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర తిలక్, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు ఆన్‌లైన్ ప్రసంగాలకు సమన్వయకర్తగా వ్యవహరించారు.

దుర్గాబాయ్ స్ఫూర్తితో సేవ చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని డెప్యూటీ మాజీ మేయర్ సామంతపూడి నరసరాజు పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం 70 సంవత్సరాల వజ్రోత్సవం సందర్భంగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆయన.. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజుతో కలిసి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త వార్తలు

• 21న రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు



మైలవరం: అనంతపురం జిల్లా అనంతపురం పట్టణంలో ఈ నెల 21వ తేదీన రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు తెలిపారు. మైలవరం పంచాయతీ అతిథి గృహం ప్రాంగణంలో శనివారం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవలందిస్తున్న రజక వృత్తిదారులు నిరంతరం ఏదో ఒక చోట అగ్రవర్ణాల వారిచే చిన్న చూపునకు గురవుతున్నారని తెలిపారు. అనంతపురంలో జరిగే సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

• విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

మైలవరం: ఉద్యోగాల్లో పోటీకి తగినట్లుగా విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో గ్రో యువర్ టెక్ స్టాక్ ఇన్ న్యూ ఎరా అనే అంశంపై ఐటీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాపు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఇప్పటి నుంచే పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇన్నోస్టెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ భావరాజు సాయి శశాంక్ మాట్లాడుతూ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, యాంగ్యులర్ జేఎస్, రియాక్ట్ జేఎస్ కాన్సెప్టులను ఐటీ సెక్టార్‌లో వినియోగం, వాస్తవికతలో వివిధ అప్లికేషన్లు విద్యార్థులకు చూపించి, వివరించారు.

• ఉపాధి పనుల తనిఖీ

తిరువూరురూరల్: మండలంలోని కాకర్లలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిర్వహిస్తున్న పనులను తిరువూరు డివిజనల్ అధికారి కే మణికుమార్ శనివారం తనిఖీ చేశారు. కూలీల మస్టరు నమోదు, జాబ్‌కార్డులు కలిగిన వారికి కల్పిస్తున్న పనిదినాల వివరాలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్లో సైతం పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున సద్వినియోగం చేసుకోవాలని ఆయన కూలీలకు సూచించారు.

డాక్టర్ కేఎల్ రావు సేవలు చిరస్మరణీయం



డాక్టర్ కేఎల్ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: తెలుగు జాతి గర్వించదగ్గ సివిల్ ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దివంగత ఇంజినీర్ డాక్టర్ కే.ఎల్. రావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వద్ద ఉన్న డాక్టర్ కే.ఎల్. రావు విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ కేఎల్ రావు నిర్ణయాల వలన నాగార్జున సాగర్, పులిచింతల వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు రూపకల్పన జరిగిందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆయా రంగాలలో నిష్ణాతులుగా తయారవ్వాలన్నారు. విద్యతో పాటు నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఆఫీసర్ శీలం ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు డా. ప్రతాప్

ముసునూరు: జగనన్న పాలనలో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని కొర్లగుంటలో జలజీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో, నిర్మించిన 40,000 లీటర్ల సామర్థ్యంగల రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.రాజానాయన, గంగాధర్, స్థానిక సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.